# మానవుడు మానవునిగా జీవించటం నేర్చుకోవాలి

పరమపావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నింటియందు వన్నె గాంచినయట్టి
ఘన సత్యశీలమే కఠినతపము
మధురభావంబేది మనదేశమందన్న
మాతృభావము కన్న మాన్యమెద్ది
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మన దేశనీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశనీతు లరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి
ఔర! ఏమందు భారతపాలనంబు
ఏనుగెట్టుల తన బల మెరుగలేదొ
అట్టులైనారు మన భారతీయులు నేడు.

జాతి గౌరవంబు నీతిపై నిలుచును
నీతి లేకయున్న జాతి చెడును
నీతి కలుగు జాతి నిజమైన జాతిరా
ఉన్న మాట తెలుపుచున్న మాట.

విద్యార్థులారా!

srisathyasaivachanamrutam

ఈనాటి మానవత్వములో మేథాశక్తి మితిమీరిపోతున్నది. కానీ గుణము మాత్రము కించిత్తైనా పెరగటంలేదు. ఈనాటి మానవుడు సాంకేతిక విజ్ఞానశాస్త్రము విరివిగా పెంచుకొని పక్షులవలే ఆకాశములో సంచరిస్తున్నాడు. మత్స్యమువలె జలములో సంచరించటం నేర్చుకున్నాడు. పక్షులవలె ఆకాశములో సంచరించటము, మత్స్యమువలె జలములో సంచరించటము అతికుశలమైన బుద్ధితో నేర్చుకున్నాడు. కానీ, మానవుడు మానవునిగా భూమిపై జీవించటం నేర్చుకోటంలేదు.

**అనేకత్వములోని ఏకత్వమును గుర్తించటమే మానవుని ప్రధాన కర్తవ్యము**

మానవుడు భూమిపై జీవించటం నేర్చుకోవాలిగానీ ఆకాశములో ఎగరటం నేర్చుకోటంవలన వచ్చిన ఫలితము ఏమిలేదు. మానవునికి భూమియే ఆధారము. ఆధారమైన భూమిని వదలి ఆకాశమునందు సంచరించటం నేర్చుకున్నంత మాత్రమున మానవుని తెలివితేటలు పెరిగినవని భావించరాదు. ఇది కేవలము భ్రాంతి మాత్రమే. తాళము తప్పిన పాట, ఇచ్చిన మాట తప్పుట ఏమాత్రము పనికిరాదు. ఈనాటి తెలివితేటలయందు ఏకత్వమును అనేకత్వముగా విభజించే మేథావులు అభివృద్ధి అవుతున్నారు. అనేకత్వంలో ఉండిన ఏకత్వమును గుర్తించే తెలివితేటలు, గుణములు ఈనాడు మరచిపోతున్నారు. అనేకత్వములోని ఏకత్వము గుర్తించటమే మానవుని ప్రధాన కర్తవ్యముగానీ ఏకత్వమును అనేకత్వముగా విభజించటము అల్ప బుద్ధి లక్షణము. ఒక్కటిగా ఉన్న వస్త్రమును అనేక ముక్కలుగా చేయుట సులభము; అనేక ముక్కలుగా ఉన్న దానిని ఏకంగా చేసుకోటం కష్టం. ఆ ఏకత్వములోనే ఆనందము గానీ, అనుకూలముగానీ చేరుతున్నాది. ఈ మానవత్వములో భిన్నత్వము, ఏకత్వము రెండింటి సమత్వము మనం గుర్తించాలి. విద్యార్థులున్నారు. ఒక Shirt కుట్టించుకోవాలనుకుంటే 2 mtrs cloth తీసుకుపోతారు. 2 mtrs పూర్తి ఒక్కటిగానే ఉంటుంది. టైలరు దగ్గరకు వెడతారు. టైలరు బుష్‌కోటు కుట్టాలి. అప్పుడు టైలరు రెండు మీటర్ల క్లాతును ముక్కలు చేస్తాడు. ఈ ముక్కలుగా చేయక బుష్‌కోటు తయారుకాదు. చేతులు వేరుగా, కాలరు వేరుగా, పోకటు వేరుగా ఉండాలి. అన్నింటియందు క్లాతు భిన్నంగా కనిపిస్తుంది. అయితే ఈ 2 mtrs cloth

srisathyasaivachanamrutam

ను అనేక ముక్కలుగా చేసేది ఏది? కత్తెర. ఆ అనేక ముక్కలను తిరిగి ఏకం చేస్తారు. Shirt కుట్టటానికి ఆ ఏకంగా చేసేది ఏమిటి? సూది. ఏకత్వమును భిన్నంగా చేసేది కత్తెర. అన్నింటిని ఏకత్వం చేసేది సూది.

## మానవ జీవితము ఆదర్శ జీవితముగా నిరూపించాలి

ఈనాటి ప్రతి మానవుడు కత్తెరగా తయారౌతున్నాడుగానీ ఏకంగా చేసే సూదిగా తయారవటంలేదు. ఇది పెద్ద తెలివితేటలనుకుంటున్నారు. ఇది కాదు, మన తెలివి తేటలు. ఈనాడు తెలివితేటలను విస్మరించి యుక్తి ప్రయుక్తులతో జీవితమును నిరర్థకము గావించుకుంటున్నారు. ఒక కుటుంబము ఉంటున్నాది. తల్లి, తండ్రి, కుమారుడు. తండ్రి కష్టపడి సంపాయించి ఇంటికి ధనము తీసుకువచ్చినప్పుడు తల్లి చాలా ఆనందపడేది. ఏనాడు పని చిక్కక వట్టి చేతులతో ఇల్లు చేరెనా ఆ తండ్రిని చూచి తల్లి చాలా కోపము పడేది. ప్రతి దినము సుఖ, దుఃఖములతో ఉండిన సంసారము చూస్తూ వచ్చాడు ఈ పిల్లవాడు. జీవితము సుఖదుఃఖముల సమ్మిళితము. లాభనష్టములు, సుఖదుఃఖములు, మంచిచెడ్డలు, చీకటివెలుగులు ఇవన్నీ ఒక దానికొకటి ప్రతిబింబములు. ఈ బాధలు భరించుకోలేక తండ్రి ఒక కాళికాదేవాలయమునకు వెళ్ళాడు. 'తల్లీ దేవీ! నేనీ బాధలు భరించుకోలేను. ఈ భార్యతో నేను జీవించలేను. ఆమెకు త్వరగా మరణము సంభవించేటట్టు చేయ'మని చెప్పాడు. తథాస్తు అన్నది దేవి. మరణించింది. ఈ దృశ్యము చూశాడు కుమారుడు. కుమారుడు తిరిగి కాళికాదేవాలయమునకు వెళ్ళాడు. దీర్ఘమైన మనస్సుతో ప్రార్థించాడు కాళికాదేవిని. కాళికా దేవి ప్రత్యక్షమైంది. 'నాయనా! ఏమి కావాల'ని ప్రశ్నించింది. 'నా తల్లిని బ్రతికించు' అన్నాడు. 'తథాస్తు' అంది కాళి. తండ్రి చావును కోరాడు. కుమారుడు జీవితమును కోరాడు. వీరి ప్రార్థన ఏమిటి? మరణము, జీవనము. ఈ రెండింటి మధ్యలోనే జీవితము అంత్యమైపోయింది. ఇదా తెలివితేటలు? తల్లికి మంచి గుణములు యిమ్మని కోరుకుంటే ఎంత హాయిగా ఉంటుంది. నా భార్యకు మంచిగుణములు ప్రసాదించమని దేవిని కోరవచ్చు కదా! కట్టకడపటికి ప్రార్థనలు చేసి ఏమి జరిగింది? జననమరణాలకు మూలకారణమైంది. దీనికి ప్రార్థనలెందుకు?



sri sathyasai vachanamrutam

**పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం**
**ఇహసంసారే బహుదుస్తారే కృపయా పారే పాహి మురారే**
**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే న హి న హి రక్షతి డుకృఞ్ కరణే.**

జననము మరణము ఈ రెండింటి మధ్యలోనే మన జీవితము అంత్యము గావించుకోటమా? మన జీవితలక్ష్యము ఏమిటి? ఈ జీవితముయొక్క గమ్యము ఏమిటి? మానవత్వమును చాలా పవిత్రమైనదిగా భావిస్తున్నారు. 'జంతూనాం నరజన్మ దుర్లభం' ఏమిటీ దుర్లభం? ఇదికాదు, మనం కోరవలసినది. మన జీవితము ఆదర్శవంతమైన జీవితముగా నిరూపించాలి.

**ఈనాడు నీవు నీ తండ్రిని ప్రేమించినప్పుడే రేపటిదినము నీ బిడ్డలు నిన్ను ప్రేమిస్తారు**

మన వైస్ ఛాన్సలర్ చెప్పాడు. పిల్లలు మరణించిన తల్లితండ్రులకు శ్రాద్ధము విడుస్తూ ఉంటారు. శ్రద్ధతో సంవత్సరమునకొక పర్యాయము కృతజ్ఞత చూపే రీతిగా కంటిధారలతో కృతజ్ఞత చూపుతారని. దీనికి 'తత్-దినం=తద్దినం' అని పేరు పెట్టారు. మరణించిన దినమును ఆనాడు స్మరించి, ఈ జన్మను ప్రసాదించినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతూ రెండు కంటి ధారలు వదలటం, అదే నిజమైన తర్పణము. మొట్టమొదట తల్లిదండ్రులకు కృతజ్ఞత నందించాలి. దేనికోసం నీ blood, నీ food, నీ head నీ parents gift. మొట్టమొదట వారికి gratitude అందించాలి. వారు మరణించిన దినమున స్మరించి వారియొక్క ప్రేమతత్త్వాన్ని, వారు అభివృద్ధి గావించిన మన జీవితమును మనం స్మరించి కంటిధారలతో తర్పణము విడచాలి. ఇది ప్రతి పుత్రునియొక్క ప్రధాన కర్తవ్యము. నీవు ఈనాడు ఆ పవిత్రకర్మలాచరించినప్పుడు భవిష్యత్తులో నీకు same reaction, resound, reflection. ఈనాడు నీవు నీ తండ్రిని ప్రేమించినప్పుడే రేపటి దినము నీ బిడ్డలు నిన్ను ప్రేమిస్తారు. ఈనాడు నీ తల్లిదండ్రులను నీవు మోసము చేసినప్పుడు నిన్ను నీ బిడ్డలు మోసం చేస్తారు. ఈ ప్రాకృత జగత్తునందు, ఈ భౌతికమైన జగత్తునందు, ఈ అనిత్యమైన జగత్తునందు

srisathyasaivachanamrutam

reaction, resound, reflection ఉంటున్నాది. ఇది తప్పించటానికి ఎవరితరమూ కాదు. మనము ఈ కృతజ్ఞతను హృదయమునందు భద్రముగావించుకొని దానికి తగిన ఆదర్శమునందించాలి.

**దైవబలము లేక మిగిలిన బలములన్నీ నిరుపయోగము**

తెలివితేటలు పెంచుకుంటున్నారుగానీ ఈనాటి విద్యార్థులలో గుణము ఎక్కడా కనిపించటంలేదు. 'చదువులందు హీరో, గుణములందు జీరో'. 'O' grade study లోపల నూటికి నూరు మార్కులు తెచ్చుకుంటారు. గుణములో నూటికి ఒక్కమార్కు రావటంలేదు. 3/4 character is life. Education without character is useless. కనుక, గుణములు మనము మొట్టమొదట సంపాయించుకోవాలి. నీవు గొప్పధనవంతుడు కావచ్చు. గొప్పమేధావి కావచ్చు. నీవు గొప్ప అధికారి కావచ్చును. నీవు గొప్ప బలవంతుడు కావచ్చును. జనబలము, బుద్ధిబలము, ధనబలము, సర్వబలములుకూడా సంపాయించవచ్చును. కానీ దైవబలము లేకపోతే మీకందరికి తెలుసు, మహాభారతమునందు

**భుజబలంబు గొప్ప బుద్ధిబలంబుండి**
**దైవబలంబులేక దీనుడయ్యె**
**కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె**
**వినుడు భారతీయ వీరసుతుడ.**

పూర్వము ఒక మహమ్మదీయ చక్రవర్తి మహాభారత కథయొక్క పవిత్రతను శ్రవణము చేశాడు. మహాభారతములో పంచపాండవులు మహాగుణవంతులు, ఆదర్శపురుషులనే సత్యమును గుర్తించాడు. ఆయొక్క గుణములు తనకు తగినట్టు చేసుకోవాలనే ఉద్దేశ్యముతో అష్టదిగ్గజములను పిలిపించాడు. అందరు వెళ్లారు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడ, మల్లన్న, సూరన్న, రామరాజభూషణుడు, తెనాలి రామకృష్ణ మొదలగు అష్టదిగ్గజములను పిలచి గొప్ప సభ జరిపాడు. చెప్పాడు, 'ఓ మహా పండితులారా! మీకు గొప్ప బహుమతిని

sri sathyasai vachanamrutam

అందిస్తాను. ఈ మహా భారత చరిత్ర నాకు అన్వయించి నా కోరిక తీరగా మీరు తిరిగి వ్రాయండి' అన్నాడు. 'మహాభారతములో సత్యవంతుడు, ధర్మస్వరూపుడు ధర్మజుడు. నన్ను ధర్మజునిగా మీరు ఎన్నుకోండి', అన్నాడు. అందులో నన్నయ చెప్పాడు, 'తానీషా! మిమ్మల్ని ధర్మరాజుగా పోల్చుకుంటాము. కానీ, నీకు నల్గురు సోదరులు ఉండాలి కదా! ఎవరిని ఎన్నుకుంటారు?' యోచన చేశాడు. 'నా మంత్రులలోపల నాకు చాలా ఇష్టమైనవారున్నారు. ఆ నలుగురుని నా సోదరులమాదిరి భావించండి', అన్నాడు, తానీషా! 'కౌరవులున్నారు. ఎవరిని వర్ణిస్తారు?' అని ప్రశ్నించారు. 'నా విరోధులందరు కౌరవులే! వారు వందలకొలది ఉంటున్నారు. కాబట్టి, నాపై ద్వేషముగానున్నవారిని కౌరవులుగా మీరు నిర్ణయించుకోండి' అన్నాడు, చక్రవర్తి. అందరు చక్కగా ఉంటూఉండినారు. తెనాలి రామకృష్ణ లేచాడు, 'తానీషావారు! పాండవులంతా సరిపోయినారు. మంత్రులను తీసుకుంటాం. భుజబలముండినవాడు భీముడు అవుతాడు. బుద్ధిబలమున్నవాడు అర్జునుడౌతాడు. యింకా తెలివిగలవారు నకులసహదేవులౌతారు. మీరు ధర్మజుడైనప్పుడు, భార్య ద్రౌపది కావలసి వస్తుంది' అన్నాడు. మంత్రులకుకూడా భార్య కావాలి. ఆమె పాంచాలి. దీనికి మీరు ఎవరిని నిర్ణయిస్తారు? అని ప్రశ్నించాడు. తల తిరిగిపోయింది, తానీషాకు. 'నాకు భారతమే వద్దు' అన్నాడు. అనగా మహాభారతములోని కీలకమును గుర్తించిన తరువాత మనం ఈ కథలలో ప్రవేశించాలి. ప్రతి విషయమునందు ఒక్కొక్క వ్యక్తికి, ఒక్కొక్క పదార్థమునకు, ఒక్కొక్క విషయమునకు ఒక్కొక్క life force ఉంటుంది. ఆ life forceను మనం గుర్తించినప్పుడే మనం సులభంగా అర్థం చేసుకోవచ్చును. ఈ life force తెలియనివారికి యిదే గతి అవుతుంది. ఈనాటి తెలివితేటలన్నీ ఈ విధమైన పెడమార్గము పట్టి పోతున్నాయి. ఈనాడు జనానికి కావలసినంత తెలివితేటలుంటున్నాయి. ఏమి ప్రయోజనము? ఎన్ని తెలివితేటలుండనీ గుణము కొంచెమైనా ఉండినప్పుడే ఎంతనైనా సాధించవచ్చు

**తెలివితేటలతోబాటు గుణమునుకూడా పెంచుకోవటానికి ప్రయత్నించాలి**

**యం.యేలు బియ్యేలు ప్యాసయి వచ్చియు**

sri sathyasai vachanamrutam

**పేరుగాంచిన పెద్దవారలైన**
**సంపదలుండియు సద్దానపరులౌచు**
**పుడమి కీర్తిని గన్న పుణ్యులైన**
**ఆయురారోగ్యము లనవరతంబుండి**
**పరిపూర్ణబలులగు వారలైన**
**జపములు తపములు సతతంబు సేయుచు**
**వేదంబులను నేర్పు విప్రులైన**
**సాటిరారు భక్తులకు నేనాటికైన**
**దైవమును గొల్వనిదె రాదు భక్తి**
**దైవ భక్తులు కానిదే రాదు ముక్తి**
**ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు**
**సాధుసద్గుణగణ్యులౌ విద్యార్థులారా!**

విద్యార్థులారా! ఇంత పవిత్రమైన భారతదేశమందు ఉద్భవించి తెలివితేటలతోపాటు గుణముకూడా మనము పెంచుకోటానికి ప్రయత్నించాలి. తెలివితేటలు కొన్ని పనులు పూర్తి చేయిస్తుందిగానీ గుణము అట్లాకాదు. కీర్తిని సంపాయిస్తుంది. మనము సంపాయించవలసినవి ఈ రెండే! ఈ జీవితములో సత్యనిత్యమైనవి ఈ రెండే. ఏమిటి? 'ధర్మం కీర్తి ద్వయం స్థిరం అనిత్యం జీవనంలోకే'. మిగిలినవన్నీ అనిత్యమైనవి. అన్నీ కదలిపోయే మేఘములవంటివి. పుట్టినాడు. పుట్టిన తక్షణమే child అని పిల్చారు. 10 సంవత్సరముల తర్వాత boy అన్నారు. 30 yrs కు man అన్నారు. 75 yrs కు grand father అని పిల్చారు. అయితే, child, boy, man, grand father ఒక్కడే! ఉన్నది ఒక వ్యక్తే. వయస్సునుబట్టి ఈ విధమైన వ్యత్యాసములు బయలుదేరుతూ వచ్చాయి. ఈనాడు లోకములో భగవంతుడు అందించిన విలువైన శక్తి ఒక్కటే! అదే కాలము. Time is very important. Don't waste time. Time waste is life waste. Time is GOD. 'కాలాయ నమః, కాల కాలాయ నమః, కాల దర్పదమనాయ నమః, కాలాతీతాయ నమః, కాల స్వరూపాయ నమః'. జననమరణాలకు కాలమే ప్రధానము. ఎవరైనా పోతే వానికి కాలము తీరిపోయింది అంటారు. చెట్టుపైన

పుట్టినకాయ కాలమువల్లనే పరిపక్వమైపోతుంది. కాలము చాలా ప్రధానమైనది, ప్రమాణమైనది.

**కష్టించి పనిచేసేవానికి భారతదేశము గొప్ప ప్రదేశము**

విద్యార్థులారా! ఈనాడు పవిత్రమైన కాలమును 3/4 వంతు వ్యర్థము చేస్తున్నారు. తిండి నిద్రలతో గడిచిపోతున్నాది. మిగిలిన 1/4 వంతు భాగము ఏమి చేస్తున్నారు? వీరిని గురించి, వారిని గురించి అనవసరమైన విషయములలో కాలము వ్యర్థము చేస్తున్నారు. ఇంక పరులను దూషించటము, పరిహసించటము యిలాంటి కార్యాలలో వ్యర్థము చేస్తున్నారు.

**పరుల తిట్టినంత పాపఫలంబబ్బు**
**విడువ దెన్నటికిని విశ్వమందు**
**పరులు పరులు కాదు పరమాత్ముడేయగు**
**సత్యమైనబాట సాయిమాట.**

పరులు పరులుకాదు, వారుకూడా పరమాత్ములే! వారిని దూషిస్తే నీవు పరమాత్ముని దూషించిన వాడౌతావు. ఎవరినీ మనం విమర్శించకూడదు. దీనితోనే కాలమును అమితంగా నష్టము చేస్తున్నాము. వారిని వీరు, వీరిని వారు ఒకరిని ఒకరు దూషించుకోటం, విమర్శించుకోటం ఇంతకంటె యింక పనిలేదా మీకు? ఏ పని లేకపోతే పరుపు వేసుకొని నిద్రపో. ఎందుకీ మాటలతో కాలమును వ్యర్థము చేస్తున్నారు? కాలము అపవిత్రము చేసినవాడు మహాపాపి. నిజముగా మన భారతదేశములో కష్టించి పని చేసినప్పుడు ఎంతైనా ఫలితముంటుంది. భారతదేశము అన్నపూర్ణస్వరూపమైనది. భారతదేశములో భూమికి తక్కువలేదు. భారతదేశములో జీవనదులకు తక్కువలేదు. ఎంతైనా పంటను పండించవచ్చు. భారతదేశములోని అనుకూలములు మరి ఏ దేశమందు లేవు. కష్టించి పనిచేసేవానికి భారతదేశము గొప్ప ప్రదేశము. ఈనాడు కష్టించి పనిచేసే వ్యక్తులు లేకపోవటంచేతనే అన్నముకోసము పరులను 'దేహి' అని అడగవలసి వచ్చింది. ఎన్ని దేశములనుండియో అప్పు తీసుకొని వస్తున్నారు. ఎందుకీ అప్పులు? మన దగ్గర



sri sathyasai vachanamrutam

సంపద కుప్పలుగా ఉంటున్నాది. దానిని సద్వినియోగం చేసుకోండి. దానిని పవిత్రము గావించుకోండి. కష్టపడి పని చేయండి. రెక్కలాడితే డొక్కలాడతాయి. మన రెండు చేతులతో పని చేస్తే ఒక్క పొట్టను నింపుకోలేమా? ఈనాడు రెండు చేతులున్నా ఒక్క పొట్టను నింపుకోలేక పోతున్నాము, బలహీనులైపోయి. రెండు చేతులనిండుకు పనిచేయి. Do your duty sincerely; hard work చేయి. అప్పుడే మన జీవితము ఆరోగ్యముగా ఉంటుంది. ఆరోగ్యమేకాదు, ఆనందముగా ఉంటుంది. ఈనాడు 'పనికి పరార్, తిండికి తయార్!' ఇంకపైన arguments. ఈ arguments చేసేవానికి పూర్తిగా మట్టే ఉండేది, తలలో

**తెలియని విషయమును గురించి వాదోపవాదములు చేయవద్దు**

> **పుస్తకములనిండ మస్తుగా చదువుండె**
> **మస్తకములనిండ మట్టి మెండు**

ఏమి ప్రయోజనము? పుస్తకాలలో ఉంటున్నాది, గొప్ప ప్రవీణత. పుస్తకమును మస్తకముగా మార్చుకో, నీ మస్తకమును పుస్తకముగా మార్చవద్దు. తెలియనివాడే argument లో ప్రవేశిస్తాడు. Argument లో మనం పోకూడదు. ఏమిటి తెలిసినదని నీవు argument చేస్తావు? చంద్రమండలము తరువాత ఏమున్నదని యోచన చేస్తావు. నీవు చూడలేదు. ఏ విధముగా argument చేయగలవు, ఏది ఉందని నీవు నిర్ణయము చేయగలవు? నీ కాలిక్రింద మట్టివుంది, భూమి వుందని చెప్పవచ్చు. ఇది నీ control లో ఉంటున్నాది. తెలియని దానిపై argument చేస్తే ఏమిటి ఫలితము? కాలము వ్యర్థము. Energy waste. యింతేకాదు, జ్ఞాపకశక్తికూడా పోతుంది. Very soon oldage ప్రారంభమవుతుంది. తెలియని దానిలో మనం ప్రవేశించటంచేత oldage quick గా ప్రవేశిస్తుంది.

విద్యార్థులారా! నాకు చెప్పటము, తలచటము, చేయటము ఒక్కటే, మీరు నమ్మినా నమ్మక పోయినా!

**సంకల్పించుకుంటే జగత్తులో సాధించలేనిది ఏదీ లేదు**

కనుక ఏ విధమైన బలహీనత నాకు ఎప్పుడు, ఏనాడు, ఎక్కడా రాలేదు. పిల్లలు

sri sathyasai vahanamrutam

చూడండి, 18 yrs 17 yrs 20 yrs వాళ్లు ఎట్లా ఉన్నారు. Castor oil face మాదిరి లొట్టలు పడిపోయింది. ఎప్పుడు happy గా ఉండాలి. జాగ్రత్తగా ఉంటుండాలి. చురుకుగా ఉంటుండాలి. ఏ పని చేయాలన్నా జాగ్రత్తగా ముందుకు నడచాలి. అప్పుడే తగిన భద్రత, శాంతి ఏర్పడుతుంది. ఈనాడు దేశములో యిలా పని చేసేవారు తక్కువ కావటంచేతనే మనము విదేశములపై ఆధారపడవలసి వస్తున్నాది. ఒక్కతూరి మీరు వెనుకకు తిరిగి చూడండి. బ్రిటీషువారు భారతదేశమును వశము చేసుకున్నారంటే ఏ విధంగా చేసుకున్నారు? పాకిస్తాను, భారతదేశములే చేరినప్పుడు 48 కోట్లు జనాభా ఉంటున్నాది 50 సం॥లకు పూర్వము. బ్రిటీషువారు ఎంతమంది? ఒక్క కోటికూడా లేరు. ఇంత చిన్న బ్రిటీషుదేశము ఇంత పెద్దదైన భారతదేశమును ఎట్లా వశము చేసుకున్నారు? భారతీయులు కేవలము తమకు తాము ద్రోహము చేసుకొంటే ఇది జరిగింది. ధనముకోసము లొంగిపోయారు. స్వార్థస్వప్రయోజాలకోసం దేహమునందించారు. పనిచేయలేని సోమరులుగా తయారైపోయారు. కనుక, వారు సులభంగా ఆక్రమించుకున్నారు, ఈ దేశాన్ని. నిజానికి మనము ఏనుగులవంటివారము. 'ఏనుగెట్టుల తన బలము ఎరుగలేదో' ఏనుగుకు తన బలము ఎంత కలదో తనకే తెలియదు. తోకతో కొడితే 90 అడుగులు దూరము పడిపోతాడు మానవుడు. అంత శక్తి ఉండినా మావటి ఒకసారి అంకుశము చూపిస్తే అణగిపోతుంది, పాపం! కారణం ఏమిటి? తన బలము తనకు తెలియదు. అట్లనే ప్రతి పిల్లవానియందు, ప్రతివ్యక్తియందు గొప్పశక్తి ఉంటున్నది. ఎంతయోశక్తి ఉంటున్నాది. ఒక్క నిముషములో ఏమైనా చేయవచ్చు. ఎంతటి విజయమునైనా సాధించవచ్చు. సంకల్పించుకుంటే జగత్తులో సాధించలేనిది కానరాదు. సాధించవచ్చు. కానీ, ఆ శక్తి తాను ఆవిర్భవింప చేసుకొనుటకు తగిన కృషి చేయటంలేదు. ఎగరటానికి ప్రయత్నం చేస్తే గరుడపక్షి ఎన్నిమైళ్ల దూరమైనా వెళ్లిపోతుంది. కానీ, ఎగరటానికి ఇష్టము లేకపోతే ఒక్కడుగైనా ముందుకు పోలేదు. చీమ చిన్నది. నడవటానికి ప్రయత్నంచేస్తే ఎన్ని మైళ్లు అయినా నడచిపోతుంది. చీమశక్తిని త్యాగరాజు వర్ణించాడు

**చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో ప్రేమమీర వెలసియుండె**
**బిరుదు వహించిన సీతారామ నన్ను బ్రోవరా!**

sri sathyasai vachanamrutam

**రామా నన్ను బ్రోవరా!**

శివ, కేశవులు అనగా ఎవరు? మానవులే! జీవము ఉన్నవాడే శివుడు. జీవము లేనివాడే శవము. శివుడనగా మానవుడే! త్యాగరాజు మరొక పర్యాయము చెప్పాడు. ఏమిటి? ప్రతి ఒక్కటి భగవత్‌శక్తియే. Walking, talking, reading, writing అన్నీ భగవంతుని శక్తులే! ఒకానొక సమయములో త్యాగరాజుకు కొంచెం విసుగు పుట్టింది. త్యాగరాజు అన్న రఘునాథుడు తమ్ముడు నిత్యం పూజించే విగ్రహాలను కావేరిలో వదలిపెట్టాడు. భగవంతుని ప్రేమను మనలో నింపుకోవాలంటే హృదయమనే పాత్రను పెద్దదిగా చేసుకోవాలి. 'రామా! ఏమిటి నాకీ బాధలు కల్గించటం. నాలో భక్తి లేదా లేక నీలో శక్తిలేదా?' అని భాదపడ్డాడు. తిరిగి, 'నిజంగా నాలో భక్తి ఉంటే రాములు నన్నువదలి వెళ్ళేవాడా? నాలోనే శక్తి ఉంటే నన్ను ఈ బాధలు పెట్టేవాడవా?' అని వాపోయాడు. 'నీలో శక్తిలేదు నాలో భక్తి ఉంది' అని అహంకారమునకు అవకాశమిచ్చాడు. 'నాలో భక్తి ఉంది. నిన్ను తలవని క్షణము లేదు. నిన్ను ప్రార్థించని నిముషము లేదు. నిన్ను ఆరాధించని సమయములేదు. నీలోనే శక్తిలేదు' అని నిర్ణయించాడు. ఇది ఎలా ఉందంటే, ఆడేది చేతకానప్పుడు డోలువానిపై అరిచాడట! తరువాత ప్రార్థన చేశాడు. కొంతసేపు తనలో తాను తర్కించుకొని 'ఛీ! నాది పొరపాటు. రాములు మహాగొప్ప శక్తివంతుడు', అనుకున్నాడు. అప్పుడు చెబుతున్నాడు:

**కపివారధి దాటునా కలికి రోట గట్టునా**
**లక్ష్మిదేవి వలచునా లక్ష్మణుండు కొలచునా**
**సూక్ష్మబుద్ధిగల భరతుడు చూచి చూచి మ్రొక్కునా**
**అప్ప రామభక్తి ఎంతో గొప్పరా!**

"నీ శక్తిలేక ఒక కోతి యింత పెద్ద సముద్రాన్ని ఎట్లాదాటింది?' 'రాంరాం,' అని నామస్మరణతోనే దాటింది. లక్ష్మిదేవి ఎవరు? ప్రపంచమంతా లక్ష్మిని ఆరాధిస్తారు. కోరనివాడు లేడు. అలాంటి లక్ష్మిదేవి నిన్ను కొలుస్తుందా? స్వామీ! నీలో శక్తిలేకపోతే ఆమె ఎందుకు కొలుస్తుంది? ఎంత గొప్పది నీ శక్తి రామా! తెలుసుకోలేని మూఢులమై ఉన్నాము.

sri sathyasai vachanamrutam

నా పాత్ర చిన్నదిగా ఉంటున్నాది. నా పాత్ర ఎంతో అంతే అనుగ్రహము వచ్చింది. నీదికాదు దోషము, నా పాత్రను పెద్దదిగా చేసుకోవాలి" అని చివరకు నిర్ణయం చేసుకున్నాడు. ఈ పాత్ర పెద్దది చేసుకుంటే భగవంతుని అనుగ్రహము దండిగా దొరుకుతుంది. భగవంతుడు ప్రేమస్వరూపుడు. ఆ ప్రేమతత్త్వము మనలో నింపుకోవాలంటే మనం హృదయమనే పాత్రను పెద్దదిగా చేసుకోవాలి. మన హృదయమును సంకుచితముగా పెట్టుకొని భగవంతునిపై నిందలు వేస్తే ఎవరి తప్పు? ఈనాటి విద్యావిధానముయొక్క దోషమే దీనికి కారణము. ఈ విద్యావిధానములోపల సరైన నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికము శూన్యమై పోయింది. ప్రాచీన సాంప్రదాయము కలిగిన ఒక పండితుని కుమారుడున్నాడు. నిరంతరము సంధ్యావందనము చేయటము, గాయత్రిని జపించటము ఈ విధమైన పవిత్రమార్గములో జీవితము గడుపుతూ వచ్చాడు. Tell me your company, I shall tell you what you are అన్నారు. కాని, కొన్నాళ్లకు దుస్సంగములో చేరిపోయినాడు, ఈ పిల్లవాడు. ఆ దుస్సంగమువల్ల 'నేనుకూడా అమెరికా పోవాలి' అనుకున్నాడు. 'నా స్నేహితులు పోతున్నారు. నేనుకూడా పోవాల'న్నాడు. అప్పుడు ఆ కుర్రవాని తండ్రి 'నాయనా! మన సాంప్రదాయము, మన సిద్ధాంతము అక్కడ సరిగా ఉండదు. అక్కడ గాయత్రి మంత్రము జపించుటకు అవకాశముండదు. సంధ్యావందనము చేసుకోటానికి అవకాశముండదు. నీవు చేసుకుంటే నిన్ను పిచ్చివాడని హేళన చేస్తారు. కనుక నీవు పోవద్దు' అన్నాడు. కానీ, యీ మొండి బిడ్డ చాలా పట్టుపట్టాడు. ఆ తండ్రికి ఒకే ఒక్క కుమారుడు. ధనేషణ, దారేషణ, పుత్రేషణ ఈ ఈషణాత్రయములు ఈనాడు ప్రజలను ఉరివేస్తున్నాయి. కుమారుని బాధ తట్టుకోలేక తల్లితండ్రులు ఒప్పుకున్నారు. ఢిల్లికి వెళ్లి Pass port, Visa అన్నీ తీసుకున్నాడు. రేపటి దినము వెళ్లిపోవాలి. తల్లి పిల్లవానితో "నీవు ఎక్కడికి పోయినా మన కులదేవతను నీ హృదయములో చింతించు. గాయత్రిని నీవు చింతిస్తూ ఉండు. 'ఓం భూర్ భువస్వః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధీయోయోనః ప్రచోదయాత్' మంత్రము మరచకు", అన్నాది. అమెరికా స్వర్గమనుకున్నాడు వాడు. నిజానికి అంత చెడ్డది మరొకటి లేదు. ఇండియా ఎంత పవిత్రమైనది! ఎంత పుణ్యమైనది! పుణ్యభూమి, ధన్యభూమి, త్యాగభూమి, దివ్యభూమి, జన్మభూమి. అక్కడ అంతా artificial life. వెళ్లిపోతున్నాడు.

srisathyasaivachanamrutam

తండ్రిమాట తీసుకున్నాడు. 'తెల్లవారి, సాయంకాలము సంధ్యావందనము చేయాలి. ఎలాంటి పరిస్థితిలోను దీనిని మరువవద్దు' అని చెప్పాడు తండ్రి. సరేనని మాట యిచ్చాడు. ఇండియా దాటిపోతే చాలనుకున్నాడు. మాటకు ప్రాణము సత్యము. సత్యమే లేదు. పోయి 5 సంవత్సరములున్నాడు. ఇండియన్ భాష మరచిపోయాడు. అమ్మతో ఫోనులో మాట్లాడితే తెలుగు రావటంలేదు. ఏదేదో మాట్లాడుతున్నాడు. తల్లికి తెలియదు పాపం. తండ్రికి యిచ్చింది. యింకా నేను 5 సం॥లు యిక్కడుండాలి. యింకా చదవాలి. ఏది చదవాలని పోయాడో అదే యింకా పూర్తికాలేదు. నాన్న, అమ్మలు పంపే ధనముతో తింటూ కూర్చున్నాడు. 'పనిలేని మంగలి పిల్లితల గొరిగాడట!' ఈ విధంగా కాలము గడిపాడు. తల్లికి చాలా సీరియస్ అయిందని టెలిగ్రామ్ యిచ్చాడు, తండ్రి. Danger come immediately అన్నాడు, లేకపోతే రాడని. పోవకపోతే తిరిగి డబ్బు పంపిస్తాడో లేదో నాన్న అనే భయంతో వచ్చాడు. కుమారుడు వస్తున్నాడని తల్లితండ్రులు చాలా ఆనందించారు. తాను ఇంటికి వ్రాసే జాబుల్లో తల్లిని మరచటంలేదు గాయత్రి పూజ చేస్తున్నాను అని అబద్ధాలు వ్రాస్తూ వచ్చాడు. Airport లో తండ్రి receive చేసుకున్నాడు. కారులో నేరుగా కాళికాలయముకు తీసుకు వెళ్లాడు. ఎందుకంటే, అమెరికా పంపించేటప్పుడు ఆమె ఆశీర్వాదముతోనే పంపించాడు. ఆమెయొక్క ఆశీర్వాదముతో తిరిగి యింటికి తీసుకుపోవాలని తండ్రికి ఆశ, పాపం! నాయనా! నమస్కారం చేయమన్నాడు. అప్పుడు అమెరికానుండి వచ్చిన కొడుకు కాళీమాతను చూచి How are you madam? అన్నాడు. తండ్రికి కోపం వచ్చి 'నీ పిండం! యిదా నీవు నేర్చుకొని రావటం. ఛీ! యిలాంటివాడు నా కొడుకే కాదు బయటకు పొమ్మ'న్నాడు. ఈ విధంగా దేవిని చూచి How are you madam అని ఇంగ్లీషులో పలకరిస్తాడా? ఎంత పొగరు! ఇది మానవత్వమా? ఇది కేవలం రాక్షసం. అలాంటివారు ఎంత చదువు చదివినా మానవులేకాదు. ఇలాంటి పిల్లలుగా తయారైపోతున్నారు, ఈనాడు. మొట్టమొదట నైతికము కావాలి. అదిలేక ఏమాత్రము జీవితము కానేకాదు. ఈనాడు దేశము ఛిన్నాభిన్నమవటానికి కారణం Moral character లేదు. కాబట్టి Morality కావాలి. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి. ఈ మూడున్నప్పుడే త్రిమూర్తిస్వరూపులుగా తయారవుతాము. ఎంత గొప్ప చదువరి అయినా దైవవిశ్వాసము కోల్పోకూడదు. అది

sri sathyasai vahamrutam

లేనివాడు శవముతో సమానమే! చనిపోయిన పులి చర్మము పనికి వస్తుంది. చనిపోయిన మృగములను మాంసమునకు కొంటారు. గొడ్డుచర్మము చెప్పులు కుట్టుకోటానికి పనికి వస్తుంది. కానీ, మానవుని దేహము చచ్చిన తరువాత దేనికీ పనికిరాదు. చర్మముకూడా పనికిరాదు. అలాంటి మానవత్వములో దివ్యమైన కీర్తిని సంపాయించుకోవాలి. అదే Ideal life. దైవప్రీతి, దైవమంటే ప్రేమ పెంచుకోవాలి. ఆ ప్రేమయే సర్వము చేర్చుకుంటుంది.

**(తేదీ 18-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam